జనజాతీయ దివస్ ఘనంగా నిర్వహించాలి

నవంబర్ 1 నుంచి 15 వరకు జిల్లావ్యాప్తంగా వేడుకలు




2

తెహెల్కా

ప్రతి వార్త సంచలనం





నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం 3 నవంబర్ 2026 పేజీలు : 4

2

రాజంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

- వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డుల పరిశీలన.
- అనుమానితులు, రౌడీషీటర్ల కదలికల పై నిరంతర నిఘా,
- మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం.



బాన్సువాడ పేలుడు బాధిత చిన్నారులకు పోచారం పరామర్శ

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



- నిలోఫర్‌లో చికిత్స పొందుతున్న అంజలి, శ్రీదేవిలను పరామర్శించిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి.
- మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచన.

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

బాన్సువాడ నియోజకవర్గం తాడ్కోల్ గ్రామ శివారులో నాటు బాంబులు పేలిన ఘటనలో గాయపడిన చిన్నారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో పరామర్శించారు. బాన్సువాడ గ్రామీణ మండలం తాడ్కోల్ గ్రామ శివారులోని ఎర్రమన్ను కుచ్చ ప్రాంతంలో ఆదివారం పందుల వేట కోసం ఉపయోగించే పేలుడు పదార్థాలు ప్రమాదవశాత్తు పేలడంతో ఏడుగురు గాయపడ్డారు.

నిమజ్జన వ్యర్థాలు తొలగించాలి: చైర్‌పర్సన్



- ట్రేక్రియాల్ చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- నీటి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి.
- మున్సిపల్ అధికారులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆదేశం.

2

రాజంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర





కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం రాజంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ పనితీరును సమగ్రంగా పరిశీలించారు. పోలీస్ శాఖలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందిం చాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచించారు. నేరాల నియంత్రణకు నిరం తరం అప్రమత్తంగా ఉంటూ, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది విధి నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారికి అందుతున్న సమాచార వ్యవస్థ, టెలికాన్ఫరెన్స్ ద్వారా జారీ చేస్తున్న సూచనలు క్షేత్రస్థాయికి సక్రమంగా చేరు తున్నాయా అని తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ విధుల్లో సమన్వయం, అప్రమత్తత పాటించాలని సూచించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

స్టేషన్‌లోని ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, కేసు ఫైళు ,పెండింగ్ కేసుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి క్రమ పద్ధతిలో నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్దిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల పరిస్థితి, అనుమానితుల వివరాలు, రౌడీషీటర్ల కదలికల పై ఆరా తీశారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిపై నిరంతర నిఘా ఉంచాలని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతిఫిర్యాదు దారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరిం చాలని ఎస్పీ సూచించారు. గ్రామస్థాయిలో పీపీఓ విధానాన్ని సమర్థంగా అమలు చేస్తూ పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, షీ టీమ్స్ ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడి పై ప్రత్యేక దృష్టి సారించాలి

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం ,అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్య కలాపాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిం చాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరి సరాలు, రికార్డు గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్‌శాఖ లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజల రక్షణే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో బిక్కనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. నరేశ్, రాజంపేట ఎస్ఐ భువనేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ పేలుడు బాధిత చిన్నారులకు పోచారం పరామర్శ





కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

బాన్సువాడ నియోజకవర్గం తాడ్కోల్ గ్రామ శివారులో నాటు బాంబులు పేలిన ఘటనలో గాయపడిన చిన్నారులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో పరామర్శించారు. బాన్సువాడ గ్రామీణ మండలం తాడ్కోల్ గ్రామ శివారులోని ఎర్రమన్ను కుచ్చ ప్రాంతంలో ఆదివారం పందుల వేట కోసం ఉపయో గించే పేలుడు పదార్థాలు ప్రమాదవశాత్తు పేలడంతో ఏడుగురు గాయపడ్డారు. క్షత గాత్రుల్లో కొందరిని నిజామాబాద్, మరి కొందరిని హైదరాబాద్‌లోని వివిధ ఆసు పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు చిన్నారులు దండ్ల అంజలి (3), దండ్ల శ్రీదేవి (5) నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బాధితులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే

ఘటన గురించి తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి ఆసుపత్రికి వెళ్లి చిన్నారులను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన అన్ని వైద్య సదు పాయాలు కల్పించాలని వైద్యులకు సూచిం చారు. అనంతరం బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చిన్నారులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇళ్లకు తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి ఆర్ఎంఓ, ఆసుపత్రి సూపరిం టెండెంట్, తాడ్కోల్ సర్పంచి రమేష్, మాజీ జడ్పీటీసీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన వ్యర్థాలు తొలగించాలి: చైర్‌పర్సన్

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ చెరువులో నిమజ్జనం అనంతరం పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన పూజా సామగ్రి, ఇతర నిమజ్జన వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ., చెరువులు పట్టణ ప్రజలకు పర్యావరణపరంగా ఎంతో ప్రాధాన్యమైనవని పేర్కొన్నారు. నిమజ్జన కార్యక్రమాలు పూర్తయిన అనంతరం వ్యర్థాలను అలాగే వదిలేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు నీటి కాలుష్యం ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ సిబ్బంది తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించాలని, పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, డీఈ హన్మంత్‌రావు, ఏఈ వేణుప్రసాద్, శానిటేషన్ ఇన్‌చార్జి ప్రశాంత్, నాయకులు రాములు, సంజీవ్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జనజాతీయ దివస్ ఘనంగా నిర్వహించాలి

- పాఠశాలలు, కళాశాలల్లో వివిధ పోటీలు నిర్వహించాలి
- కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్రను భావితరాలకు తెలియజేసే లక్ష్యంతో జిల్లా కలెక్టరేట్ లో వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., నవంబరు 1 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, గిరిజన గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం, త్యాగాలు, గిరిజన సమాజ అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

గిరిజన కళాకారులను సన్మానించాలి

విద్యార్థులకు గిరిజన చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంపై వ్యాసరచన, చిత్రలేఖనం, నినాదాలు, కథలు, కవితలు, క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. గిరిజన కళలు, చేతివృత్తులు, సంగీతం, నృత్యాల ప్రదర్శనలకు అవకాశం కల్పించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన గిరిజన ప్రముఖులు, కళాకారులను సన్మానించాలన్నారు.

అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి

నవంబరు 15న భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవ దివస్‌ను ఘనంగా నిర్వహించి ఆయనకు నివాళులర్పించాలని కలెక్టర్ పేర్కొ న్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, సీఈవో చందర్,ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుందరెడ్డి, డీఆర్వో పాండు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలోని ఎంపీ నివాసంలో షబ్బీర్ అలీకి తేనేటి విందు

- హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు.

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)



జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షేట్కర్ ఢిల్లీలోని తన నివాసంలో సోమవారం నిర్వహించిన తేనేటి విందు కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇప్ప శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపరి భీమిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అంకన్నగారి నాగరాజు గౌడ్, అంకం రాజు, శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పరస్పరం ఆత్మీయంగా పలకరించు కున్నారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమం కాంగ్రెస్ నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. ఎంపీ సురేష్ కుమార్ షేట్కర్ ఆతిథ్యంలో నిర్వహించిన ఈ విందులో పలువురు నాయకులు పాల్గొని సందడి చేశారు.ం

గౌరారం ఉమ్మడి గ్రామంలో భూ భారతి రీ సర్వే ప్రారంభం

- భూభారతిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
- ఏడీఈ శ్రీనివాసులు.



ఇందల్వాయి, నవంబర్ 2 (తెహెల్కా న్యూస్)

ఇందల్వాయి మండలంలోని గౌరారం ఉమ్మడి రెవెన్యూ పరిధిలోని వివిధ గ్రామాలలో భూభారతి రీ సర్వేను ప్రారంభించడం జరిగిందని నిజామాబాద్ ఏడీఈ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ప్రతి ఒక్కరు భూ సమస్య ఉన్నవారు భూభారతి సర్వేలో పేర్లు నమోదు చేసుకొని భూ సమస్యను నమోదు చేసుకోవాలని సూచించారు. కోడారం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో జి కే తండా, గౌరారం, గౌరారం తాండ, లింగాపూర్ తదితర గ్రామాలలో భూ సమస్యలు ఉన్నట్లయితే తక్షణమే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి భూ సమస్యలు లేకుండా భూభారతి కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టడం జరిగిందని ఇందల్వాయి తాసిల్దార్ బాలయ్య వెల్లడించారు. ప్రతి ఒక్కరు భూ భారతి రీ సర్వేను ఉపయోగించుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో గౌరారం గ్రామ సర్పంచ్ గజ్జల హేమలత, జీకే తండా సర్పంచ్ శిరీష మహిపాల్ నాయక్, ఉప సర్పంచ్ రజిత సుధీర్, కాంగ్రెస్ నాయకులు సంతోష్ రెడ్డి, కరుణాకర్, తాసిల్దార్ బాలయ్య, జిపిఓలు, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీలో జైపాల్ రెడ్డికి చోటు

- అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి నియామకం.
- కామారెడ్డికి రాష్ట్రస్థాయి గుర్తింపు.. క్రీడాకారుల అభినందనలు.
- జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాల కల్పనకు కృషి.

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)



తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కామారెడ్డికి చెందిన ప్రముఖ విద్యావేత్త, ఆర్మీ గ్రూప్ సీఈఓ, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి నియమితులయ్యారు.క్రీడారంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన అసోసియేషన్ ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకాన్ని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. మల్లారెడ్డి అధికారికంగా ధ్రువీకరించారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి చైర్మన్‌గా, మాజీ మంత్రి వేణుగోపాల్ చారి వైస్ చైర్మన్‌గా, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న అడ్వైజరీ కమిటీలో జిల్లా నుంచి జైపాల్ రెడ్డికి అవకాశం లభించడం పట్ల క్రీడావర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

క్రీడారంగంలో సేవలకు గుర్తింపుగా బాధ్యతలు

విద్యార్థులు, యువతను అథ్లెటిక్స్‌తో పాటు వివిధ క్రీడల వైపు ప్రోత్సహించడమే తనకు ఈ బాధ్యత దక్కడానికి కారణమని జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా కృషి చేస్తానన్నారు. అన్ని క్రీడల్లో జిల్లా నుంచి ప్రతిభావంతులు ప్రాతినిధ్యం వహించేలా ప్రోత్సహిస్తానని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి నియామకంపై జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

హోటళ్లలో కృత్రిమ రంగుల వినియోగం.. అపరిశుభ్రత తాండవం!

- రెస్టారెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమ రంగుల వినియోగం గుర్తింపు.
- వంటశాలలో అపరిశుభ్రత.. సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతలోనూ లోపాలు.
- అపరిశుభ్రతపై ఆహార భద్రత శాఖ తనిఖీలు,15 కిలోల పనికిరాని నిల్వ ఆహారం ధ్వంసం.
- అనుమతిలేని రంగులు వినియోగిస్తే కఠిన చర్యలు
- ఆహార భద్రత అధికారి విక్రమ్.

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)





ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలనే లక్ష్యంతో ఆహార భద్రత శాఖ అధికారులు రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాలపై తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు హోటళ్లలో ఆహార తయారీ విధానం, వంటశాలల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమ ఆహార రంగులు వినియోగి స్తున్నట్లు గుర్తించడంతో పాటు అపరిశుభ్రతకు సంబంధించిన లోపాలను గుర్తించారు. కామారెడ్డి పట్టణంలోని అల్ సుభాన్ రెస్టారెంట్‌ను ఆహార భద్రత అధికారి విక్రమ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చికెన్ కూరలు, వేయించిన అన్నం తదితర వంటకాల తయారీలో అనుమతిలేని కృత్రిమ ఆహార రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడం, వంట సిబ్బంది తలకు కవర్లు, చేతులకు గ్లౌజులు, ఏప్రాన్లు ధరించక పోవడం వంటి లోపాలు బయటపడ్డాయి.

వినియోగానికి పనికిరాని ఆహార పదార్థాల ధ్వంసం

మానవ వినియోగానికి పనికిరాని సుమారు 15 కిలోల నిల్వ ఆహార పదార్థాలను అధికారులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనుమానిత ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. సంబంధిత సంస్థకు ఆహార భద్రత, ప్రమాణాల చట్టం-2006లోని సెక్షన్ 32 ప్రకారం నోటీసు జారీ చేశారు. అదేవిధంగా పట్టణంలోని ఎస్ఎస్ఎస్ టిఫిన్ సెంటర్‌లోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అక్కడ వంటశాల అపరిశుభ్రంగా ఉండటంతో పాటు వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. ఈ లోపాలను సరిదిద్దుకోవాలని ఆదేశిస్తూ సంస్థ నిర్వాహకులకు మెరుగుదల నోటీసు జారీ చేశారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి విక్రమ్ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. వంటశాలలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ముడి పదార్థాలతోనే ఆహారాన్ని తయారు చేయాలని సూచించారు. వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ తల కవర్లు, చేతి తొడుగులు, ఏప్రాన్లు ధరించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ప్రయోగశాల నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని వెల్లడించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాలు కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విక్రమ్ సూచించారు. అధికంగా కృత్రిమ రంగులు కలిపి ఆకర్షణీయంగా కనిపించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఆహార నాణ్యత, పరిశుభ్రతపై అనుమానాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

– బిక్కనూరు పీహెచ్‌సీలో అమ్మఒడి కార్యక్రమం.
– గర్భిణులకు వైద్య పరీక్షలు, అవసరమైన మందుల పంపిణీ.
– ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచన.

బిక్కనూరు, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించి, సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా బిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యురాలు డాక్టర్ యమీమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిక్కనూరు ఏ,బి ఉపకేంద్రాల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన పరీక్షలు చేసి మందులు అందజేశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన ఇంజక్షన్లు ఇచ్చారు. సాధారణ ప్రసవం జరిగేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన వ్యాయామాలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. నెలలు నిండిన గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని వైద్యురాలు సూచించారు. కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

చర్మం పై మచ్చలున్న వారిని గుర్తింపుకు ఆశా కార్యకర్తల సర్వే

అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చర్మంపై మచ్చలు ఉన్నవారిని గుర్తించేందుకు ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే



నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజమణి, పబ్లిక్ హెల్త్ నర్స్ జానకి, ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడితో ఇప్ప శ్రీనివాస్ మర్యాదపూర్వక భేటీ

– పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ పరిస్థితులపై చర్చ.
– ప్రభుత్వ పథకాలను గ్రామీణ స్థాయిలో తీసుకెళ్లాలని పీసీసీ అధ్యక్షులు సూచన.
– క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్న ఇప్ప శ్రీనివాస్.

కామారెడ్డి, నవంబరు 2 (తెహెల్కా న్యూస్)

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ నాయకుడు ఇప్ప శ్రీనివాస్ సోమవారం తెలంగాణ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, స్థానిక రాజకీయ పరిస్థితుల పై వారు కాసేపు చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ దిశానిర్దేశంలో కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు సాగుతోందని ఇప్ప శ్రీనివాస్ కొనియాడారు. పార్టీ అధిష్ఠానం అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం



చేసుకుంటూ పనిచేయాలని అధ్యక్షులు సూచించారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలు , ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించడం తదితర అంశాల పైనా అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ భేటీలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

– టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచన.
– టీపీసీసీ చీఫ్ ని కలిసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్.

కామారెడ్డి, నవంబర్ 2 (తెహెల్కా న్యూస్)

క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో ఆయనను కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగరాజ్ గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు వచ్చి ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరికీ టీపీసీసీ చీఫ్ ధన్యవాదాలు తెలిపారన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సఖ్యత పెంచి, పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, స్థానిక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తూ, గ్రామస్థాయి, బూత్ స్థాయి, మండల, పట్టణ మరియు డివిజన్ కమిటీలను, పార్టీ యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో మరింత పటిష్టం చేయాలని టీపీసీసీ చీఫ్ సూచించినట్లు నాగరాజు గౌడ్ తెలిపారు.



ఇందల్వాయి ప్రజావాణిలో 8 ఫిర్యాదులు

ఇందల్వాయి, నవంబర్ 2 (తెహెల్కా న్యూస్)



ఇందల్వాయి మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామా ల నుండి 8 ఫిర్యాదు లు రావడం జరిగిందని ఎంపీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయా ఫిర్యాదులను వివిధ శాఖలకు పంపించడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఫిర్యాదుదార్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధి కారులు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. విద్యుత్ శాఖకు చెందిన ఒక ఫిర్యాదు రాగా, రెవిన్యూ శాఖకు చెందిన రెండు ఫిర్యాదులు ప్రజావాణి రావడం జరిగిందని ఆయన వివరించారు. ఎస్జెచ్ఓ కు 1, ఎంపీఓకు మూడు ఫిర్యాదులు రావడం జరిగిందన్నారు. నీటి పారుదల శాఖకు చెందిన ఒక ఫిర్యాదు రాగా ఆయా ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపించడం జరిగిందని స్పష్టం చేశారు. అతి త్వరలోనే ప్రజలు అందించిన ఫిర్యాదులను పరిష్కారం దిశగా కృషిచేస్తామని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

తాగి వాహనాలు నడిపిన ఇద్దరికీ జైలు శిక్ష

– ఎస్ఐ భూక్య సుమలత.

ఇందల్వాయి, నవంబర్ 2 (తెహెల్కా న్యూస్)



తాగి వాహనాలు నడిపిన ఇద్దరికీ జైలు శిక్ష పడినట్లు ఇందల్వాయి ఎస్ఐ భూక్య సుమలత తెలిపారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని తెలిపారు. సిరికొండ మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన సురేష్, ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన బోయ శ్రీనివాస్ పట్టుబడ్డారని తెలిపారు. సోమవారం వారిని నిజామాబాద్ లోని స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు సోమవారం హాజరు పరుచగా న్యాయమూర్తి బాలరాజు ఇద్దరికీ ఒక రోజు జైలు శిక్ష విధించడం జరిగిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ., తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జైలు జీవితం గడపక తప్పదని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం మానుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

నల్గొండలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

– కరపత్రాలను ఆవిష్కరించిన రైతు సంఘం నాయకులు

కామారెడ్డి, నవంబర్ 2 (తెహెల్కా న్యూస్)

నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్ల మోహన్, జిల్లా కార్యదర్శి పబ్బ దశరథం కోరారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యల పరిష్కారంలో ఈ మహాసభలు కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి చారిత్రక నేపథ్యమున్న నల్గొండ గడ్డపై జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకొనుందన్నారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 4 వేలకు పైగా ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొననున్న తెలిపారు. రైతులు, ప్రజలు పార్టీలకు అతీతంగా సహకరించి ఈ మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భూపతి, మహేందర్, రాములు, సుధాకర్, రాజయ్య, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.